క్లుప్తంగా

పారిశుధ్య పనుల నిర్వహణ



పారిశుధ్య పనులు చేయిస్తున్న ఎంపీవో

లింగాపూర్: మండలకేంద్రంలో సోమవారం ఎంపీవో ఉమర్‌షరీఫ్, సెక్రటరీ రజనీకాంత్ ఆధ్వర్యంలో ప్రధాన వీధులతో పాటు రహదారికి ఇరువైపులా ఉన్న చెత్త, పిచ్చిమొక్కలను తొలగించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థులకు మొక్కల ప్రాముఖ్యత వివరించాలి



మొక్కలు నాటుతున్న ఎస్సై సాగర్

వాంకిడి: మొక్కల పెంపకం, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించాలని ఎస్సై సాగర్ అన్నారు. సోమవారం మండలంలోని అర్జుగూడ ప్రభుత్వ పాఠశాలలో కాంగ్రెస్ యూత్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. మొక్కలతో లాభాలు, ప్రాముఖ్యత వివరించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, పార్టీ యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, నాయకులు అనిల్, గణేశ్, దాదాజీ, బొట్టుపల్లి జైరాం, దీపక్ ముండె, జమల్‌పురి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ

కెరమెరి: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్నారు. మండలంలోని ప్రాథమిక, ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు 56 ఉండగా సోమవారం 52 పాఠశాలల్లో 202 మొక్కలు నాటారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నాటిన మొక్కలకు ప్రతిరోజు నీరు పోయాలని, ఇళ్లల్లో కూడా మొక్కలు నాటాలని కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఆడే ప్రకాశ్, చంద్రశేఖర్, భరత్ పేర్కొన్నారు.

'అమ్మ ఆదర్శ' పనుల పరిశీలన

కెరమెరి: మండలంలోని మోడి గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సోమవారం మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ పరిశీలించారు. తాగునీటి సౌకర్యం, విద్యుత్ కనెక్షన్లు, వివిధ రకాల మరమ్మతులు, మరుగుదొడ్లను పరిశీలించారు. మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌వో మీనా కుమారి ఉన్నారు.

సమయపాలన పాటించాలి

కెరమెరి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి కుడ్మెత సుధాకర్ అన్నారు. సోమవారం మండలంలోని ధనోరా పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజు ప్రార్థనకు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. రికార్డులు నమోదు చేయాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని పేర్కొన్నారు.

గోరింటాకు సంబరాలు



గోరింటాకు సంబరాల్లో మహిళలు

పెంచికల్‌పేట్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో మహిళా సంఘం ఆధ్వర్యంలో సోమవారం గోరింటాకు సంబరాలు నిర్వహించారు. వాసవిమాతకు ప్రత్యేక పూజలు చేశారు. గోరింట ఆకులను కోసి ముద్దగా నూరి ఒకరికొకరు గోరింటాకు పెట్టుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సముద్రాల సరిత, పెద్ది వర్షిని, పూజిత, శరణ్య, సుకన్య, వాణిశ్రీ, నిర్మల, వనిత, రేణుక పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

జైనూర్: వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి సుంకన్న అన్నారు. సోమవారం సిర్పూర్(యూ) మండలంలోని గుంనూర్ గ్రామంలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో వికాస్ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల నుంచి వచ్చిన 55 మంది మహిళా రైతులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన మాత్రలు అందించారు. విజయ్, ధన్‌రాజ్, భగవాన్ ఉన్నారు.

దారి కష్టాలు తీరేదెన్నడో..?

- సరైన రోడ్డు లేక నానా తంటాలు
- అత్యవసర సమయాల్లో తప్పని ఇబ్బందులు
- మరమ్మతులు చేపట్టాలని ప్రజల వేడుకోలు
- నిలిచిన బస్సు సర్వీసు



కోతకు గురైన మంగి గ్రామానికి వెళ్లే రోడ్డు

తిర్యాణి: మండలంలోని ఆదివాసీ గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 29 గ్రామపంచాయతీలు, 138 అనుబంధ గ్రామాలు ఉండగా సగానికి పైగా గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా తమ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు..

మండలంలో గుట్టపై ఉన్న గ్రామాలు మంగి, ముల్కల మంద, కొటగాం, కైరిగూడ, టోక్కిగూడ, తాటిగూడ, ఎర్రబండ, కొలంగూడ, పటేల్‌గూడ తదితర గ్రామాలకు మండల కేంద్రం నుంచి వెళ్లే ఏకైక రహదారి అధ్వానంగా మారడంతో అవస్థలు తప్పడం లేదు. దట్టమైన అటవీప్రాంతంలో దాదాపు ఆరు కిలో మీటర్ల మేర ఉన్న రహదారిపై ఎక్కువగా పెద్ద బండరాళ్లు ఉండటం, వర్షాకాలంలో కురిసిన వర్షాలకు గుట్టపై నుంచి నీళ్లు కిందకి ప్రవహించి రోడ్డు పూర్తిగా కోతకు గురవుతుండటంతో రహదారి కష్టాలు తప్పడం లేదు. గతంలో పలుమార్లు గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టినా వర్షాకాలం ప్రారంభంలో కురిసే వర్షాలకు కోతకు గురై రాకపోకలకు అడ్డంకిగా మారుతోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్డు మళ్లీ కోతకు గురవడంతో ద్విచక్ర వాహనాలు తప్ప మిగతా ఏ వాహనాలు కూడా వెళ్లేందుకు వీలు లేకుండా మారింది. వారం రోజుల క్రితం మండల కేంద్రం నుంచి మంగి గ్రామానికి పంట ఎరువులను తీసుకెళ్తున్న ట్రాక్టర్ దిగబడడంతో మధ్యలోనే డంప్ చేసి ఎడ్లబండ్లపై తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

అత్యవసరమైతే అంతే సంగతి..

గుట్టపై నుంచి కింది ప్రాంతానికి వచ్చే రోడ్డు సరిగా లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో గుట్టపైకి అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. దీంతో అక్కడి ప్రజలు ద్విచక్ర వాహనం లేదా ఎండ్ల బండి సహాయంతో రోగులను తరలిస్తున్నారు. రోడ్డు కోతకు గురవడంతో గత నెల 25 నుంచి ఆర్టీసీ సంస్థ ఆసిఫాబాద్ నుంచి మంగి గ్రామం వరకు నడిపించే బస్సు సర్వీసును సైతం నిలిపివేసింది. బీటీ రోడ్డు వేసి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

మస్తు కష్టమవుతుంది..



మా గ్రామానికి వెళ్లే గుట్ట దారి పూర్తిగా కోతకు గురవడంతో వివిధ పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి మస్తు కష్టమవుతుంది. వర్షం పడిన సమయంలో రోడ్డు బురదమయంగా మారుతుండటంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి కింద పడిపోతున్న సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయి.

- మడావి భీంరావు, మంగి

ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా

- సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించాలని అంగన్‌వాడీ ఉద్యోగుల డిమాండ్



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

కాగజ్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఆర్.త్రివేణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సర్‌సిల్క్ రాంమందిర్ నుంచి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఇంటి వరకు ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే ఇంటి ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గతంలో 24 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపట్టామని, అయితే అప్పటి ప్రభుత్వం హెల్పర్స్‌కు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.లక్ష, అంగన్‌వాడీ టీచర్లకు రూ.2లక్షలు, ఆసరా పెన్షన్లు చెల్లిస్తామని, 65 సంవత్సరాల్లోపు రిటైర్మెంట్ అయిన వారికి వీఆర్ఎస్ వర్తింపు చేస్తామని, తదితర డిమాండ్లను హామీ ఇచ్చిందన్నారు. నేటికీ అవి అమలు కావడం లేదన్నారు. తమ సమస్యలపై అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రస్తావించాలని కోరుతూ మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు అరుణ, మల్లీశ్వరి, వినోద, కృష్ణవేణి, కుమారి, రజిత, ఉమాదేవి, హేమవతి, రాజమణి, శ్రీలత, అర్చన, మంగళ, జయప్రద తదితరులు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మీసేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కోవ లక్ష్మి

జైనూర్: నూతనంగా ప్రారంభమైన మీసేవ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నూతన మీ సేవ కేంద్రాన్ని నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆన్‌లైన్‌లో చేపట్టాల్సిన పనులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవరావు, నాయకులు మెస్రం అంబాజీ, భగవంత్‌రావు, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మడావి భీంరావు, ఇంతియాజ్‌లాలా, చిర్లే లక్ష్మణ్, లచ్చుపటేల్, మెస్రం రాహుల్, శ్యాంరావు, నాయకులు తదితరులు ఉన్నారు.

అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా అన్ని రంగాల్లో ముందుండేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్‌లతో కలిసి ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీరు, ఆహారం తీసుకునే విషయంలో జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలోని అన్ని శాఖలకు 53లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈనెల 31 వరకు లక్ష్యం చేరుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలను బలోపేతం చేయాలన్నారు. పాఠశాలల్లో చేపడుతున్న పనులను తర్వగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో వివిధ శాఖల పరిధిలో కొనసాగుతున్న పనులకు సంబంధించి ప్రతీరోజు నివేదికలు అందించాలని పేర్కొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన



మాట్లాడుతున్న ఈజ్‌గాం ఏఎస్సై హీరామన్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.12 గ్రామంలో గల ఎస్ఎస్ఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఈజ్‌గాం ఏఎస్సై హీరామన్ మాట్లాడుతూ సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎవరైనా మోసపోయినట్లయితే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్‌నియమాలు, సైబర్ మోసాలు, గంజాయి నివారణ, సీసీ కెమెరాల ఆవశ్యకతపై పోలీసు కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపొద్దు

కెరమెరి: పత్రాలు లేకుండా వాహనాలను నడపొద్దని ఏఎస్సై రాథోడ్ ఉల్లాస్ అన్నారు. సోమవారం మండలంలోని సాకడ చౌరస్తాలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వాహనంలో మోతాదుకు మించి ప్రయాణికులకు తరలించొద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు తప్పక వేసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట పీసీ ప్రేం ఉన్నారు.

కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం కాగజ్‌నగర్ ఆర్డీవోకు చింతగూడ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కోయవాగు గ్రామపంచాయతీ సరిహద్దు నుంచి బలగల చింతగూడ వెళ్లే దారిలో గల గ్రామపంచాయతీ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా వారికి సహకరిస్తున్న గ్రామపంచాయతీ కార్యదర్శిపై సైతం చర్యలు తీసుకోవాలని కోరారు.

18న ద్విచక్ర వాహనాల వేలం

ఆసిఫాబాద్‌అర్బన్: వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు ద్విచక్ర వాహనాలను ఈ నెల 18న వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగా 50 శాతం డిపాజిట్‌గా చెల్లించి, వేలంలో పాల్గొనాలని సూచించారు.

'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' ర్యాలీ



పెంచికల్‌పేట్: ఎల్కపల్లిలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది



వాంకిడి: ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి మాట్లాడుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. గ్రామాల్లో బడి బయట పిల్లలు లేకుండా ప్రజా ప్రతినిధులు, వీవోలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు సహకరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీప్రైమరీ విద్యార్థులకు అందిస్తున్న బోధన వివరాలను తెలియజేశారు. సూపర్‌వైజర్ హసీనా, ఉపాధ్యాయులు అర్షియా సుల్తానా, ప్రియాంక, చంద్రకళ, పంచాయతీ కార్యదర్శి శేఖర్, హైమద్, వీవో సంగీత తదితరులు పాల్గొన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు సోమవారం 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. సీడీపీవో రెబ్కా మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమం ఈ నెల 15 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదివాసీల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: ఆదివాసీల అభివృద్ధి కోసం కృషి చేస్తామని మన్నెవార్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బా బాపు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదివాసీల హక్కుల సాధన కోసం మన్నెవార్ కొలావార్ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు సుంకె కిష్టయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య ఆదేశాల మేరకు ఇటీవల జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివాసీ మన్నెవార్ సేవా సంఘం పేరిట కొంత మంది సంఘం నాయకులు ఇష్టారాజ్యంగా మన్నెవార్ సేవా సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలో కొంతమంది సంఘ సభ్యులు ఏకపక్షంగా జిల్లా బాధ్యులకు సమాచారం ఇవ్వకుండా రాష్ట్ర కమిటీ ఎన్నిక జరిగినట్లు ప్రకటించడం సరికాదన్నారు. కొంత మంది తమ లబ్ధి కోసం నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీకి కుల సంఘానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాపురావు, కుర్మ ప్రసాద్, కౌటాల మాజీ సర్పంచ్ కుర్మ రాజు, యువజన సంఘం ఉపాధ్యక్షులు డబ్బా గోపాల్, నాయకులు సత్తయ్య, కార్తీక్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పీరీల ఊరేగింపు



రెబ్బెనలో పీరీలు ఊరేగిస్తున్న భక్తులు



దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఇట్యాల, రాళ్లగూడ, ఒడ్డుగూడ, మొట్లగూడ, హత్తిని, పీపీరావు కాలనీ తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకల్లో భాగంగా గ్రామాల్లో వీధుల గుండా పీరీలను ఊరేగిస్తున్నారు. ప్రజలు మొక్కులు చెల్లిస్తున్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే మొహర్రం వేడుకలు జిల్లా కేంద్రంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఏడోరోజు కొనసాగాయి. ఆదివారం రాత్రి జిల్లా కేంద్రంలోని మజీద్‌వాడీ, జన్కాపూర్‌లో మొహర్రం ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మలిద ముద్దలతో, బెల్లం, షర్బత్ ప్రత్యేక వంటకాలతో డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేశారు. పీరీల మందిరం నుంచి పలు కాలనీల్లో ఊరేగింపు నిర్వహించారు. నిర్వాహకులు రాకేశ్, హసీన్, సుధాకర్, నారాయణ, రఫీక్, నజీర్, బాబా తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: మొహర్రం సందర్భంగా గ్రామాల్లో ప్రతిష్ఠించిన పీరీలు సందడి చేస్తున్నాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి చిన్న సరగత్తె కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పీరీలకు మటికీలు, మలిద ముద్దలను ప్రసాదంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని గోలేటిలో గల హసన్ హుస్సేన్ పీరీల బంగ్లాతో పాటు పుంజుమేర గూడలోని భూవమ్మతల్లీ దేవస్థానం, నంబాలలోని పీరీల బంగ్లాల వద్ద సందడి నెలకొంది. సోమవారం తెల్లవారు జామున పీరీలను గద్దె పైనుంచి లేపి గ్రామాల్లో ఊరేగించారు.

కనుల పండువగా జగన్నాథ రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన జగన్నాథ రథయాత్ర కనుల పండువగా కొనసాగింది. గణేశ్ మందిర్ నుంచి ప్రారంభమైన రథయాత్ర వేదమందిర్ వరకు కొనసాగింది. రథయాత్రలో ఉమ్మడి నజ్రూల్‌నగర్ పంచాయతీలోని 13 గ్రామాల భక్తజనం తరలిరావడంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బీఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రథయాత్రలో పాల్గొన్నారు.

వైభవంగా శాకాంబరీ ఉత్సవ పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

కాగజ్‌నగర్‌రూరల్: పవిత్ర ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని సోమవారం ఈజ్‌గాం శివమల్లన్న దేవాలయంలో శాకాంబరీ ఉత్సవ పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలోని మహంకాళి, శీతలమాత, పార్వతిదేవి అమ్మవార్లను వివిధ రకాల కూరగాయలతో అలంకరించి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మహాహారతి, మంత్రపుష్పం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు ముద్దు నరహరి శర్మ, దేవాలయ అర్చకులు సంతోష్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మైలారపు మురళీధర్ దంపతులు, సభ్యులు ఎమ్మాజీ శారద సంతోష్, ఆలయ ఈవో వేణుగోపాల్‌గుప్తా, మాజీ చైర్మన్ ఇందారపు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ ఎంపీకి సన్మానం



గోడం నగేశ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

జైనూర్: గత పార్లమెంటు ఎన్నికల్లో విజయం సాధించిన ఎంపీ గోడం నగేశ్‌ను మండలంలోని పట్నాపూర్ గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతంలోని రహదారుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ నగేశ్ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. నాయకులు సిడాం మాన్కు, ఆత్రం సుదర్శన్, ఆత్రం రూప్‌దేవ్, పూసం జ్యోతిరాం, కుంర మానిక్‌రావు తదితరులు ఉన్నారు.

ప్రారంభమైన వరి నాట్లు



దహెగాం మండలంలోని ఒడ్డుగూడ, కుంచవెల్లి తదితర గ్రామాల్లో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల చెరువులు, ప్రాజెక్టుల్లో వరద చేరకపోవడంతో ఆయకట్టు కింద వరి సాగు పనులు ప్రారంభించలేదు. బోర్లు, బావులు ఉన్న రైతులు వరి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. మండల వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 18వేల ఎకరాల్లో వరి సాగవుతున్నట్లు అధికారులు అంచనా వేశారు. – దహెగాం